- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

బుధవారం
06-05-2026

సంపుటి : 01 సంచిక : 45 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 45 NAMASTEY MAHAAPRABHA

## భారతీయుల రక్తం చిందితే సహించం

### ఇరాన్‌కు ఇండియా స్ట్రాంగ్ వార్నింగ్


- యూఏఈపై ఇరాన్ డ్రోన్ దాడి
- ముగ్గురు ఇండియన్స్‌కు గాయాలు
- తీవ్రంగా పరిగణించిన భారత్

3 లో



## మా నౌకలపై దాడి చేస్తే తుడిచిపెడతాం

- కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి
- హర్మూజ్ లో మళ్లీ కాల్పుల మోత
- దూకుడుగా వ్యవహరిస్తే ఊబిలో పడతారు : ఇరాన్
- యుఎఇ ఓడరేవుపై ఇరాన్ డ్రోన్ దాడి
- ముగ్గురు భారతీయులకు గాయాలు



టెహ్రాన్ 05మే (మహాప్రభ )
పశ్చిమాసియాలో మరోసారి ఘర్షణలు మొదలయ్యాయి. ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నదీ లేనిదీ తెలియని పరిస్థితి నెలకొంది. హర్మూజ్ జలసంధిలో ఇరు పక్షాలు కాల్పులకు దిగాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నదా అని అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు -మిగతా 3 లో



## శాసనసభా పక్ష నేతగా విజయ్ ఎన్నిక

- ప్రభుత్వం ఏర్పాటుపై సమావేశంలో చర్చ
- మెజార్టీ కోసం గవర్నర్‌ను 15 రోజులు గడువు కోరిన టివికె
- పొత్తు కోసం ఎవరినీ అడుక్కోబోమని స్పష్టీకరణ

చెన్నై, 05మే (మహాప్రభ )
తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ మెజారిటీకి కొద్ది దూరంలో ఉంది. ఇదే సమయంలో పార్టీ లెజిస్లేటివ్ లీడర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటుకు కొన్ని సీట్లు తక్కువగా ఉన్న అంశాన్ని నేతలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ.. రాజకీయపరంగా ఆత్మగౌరవం విషయంలో తమ పార్టీ రాజీపడబోదన్నారు. పొత్తు విషయంలోనూ తమ పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని ఆ పార్టీ నేతలు తెలిపారు.
-మిగతా 3 లో

## సీఎం పదవికి స్టాలిన్ రాజీనామా..




3 లో


# ఎన్నికల ఫలితాలు.. తారుమారు!

### బెంగాల్, అసోంలో బీజేపీ గెలవలేదు

- ఈసీ సహకారంతో ఎన్నికలను దొంగిలించింది
- కమలం పార్టీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆందోళన
- బెంగాల్‌లో 100 సీట్లు దొంగిలించారన్న మమత వాదనకు మద్దతు
- మధ్యప్రదేశ్, హరియాణా తరహాలోనే ఇక్కడా జరిగిందన్న కాంగ్రెస్ అగ్రనేత

న్యూఢిల్లీ, 05మే (మహాప్రభ )
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పై కాంగ్రెస్ నేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో బీజేపీ ఎన్నికల్లో గెలవలేదని, ఎన్నికల సంఘం (ఈసీ) సహకారంతో ఫలితాలను తారుమారు చేసిందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ మేరకు తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లో 100కు పైగా సీట్లను బీజేపీ తారుమారు చేసిందంటూ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ చేసిన ఆరోపణలతో తాము ఏకీభవిస్తున్నామని రాహుల్ స్పష్టం చేశారు. బెంగాల్, అసోంలో ఎన్నికల ఫలితాలను స్పష్టంగా తారుమారు చేశారని ఆయన పేర్కొన్నారు. -మిగతా 3 లో



## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

- రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం
- నేటిలోగా సమాధానం రాకపోతే ఆందోళన తీవ్రం
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన కెటిఆర్

జనగామ, 05మే (మహాప్రభ )
రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించారని, అయితే ఆ మేరకు కొనుగోలు ప్రణాళికలు రూపొందించలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం కేవలం 10 లక్షల టన్నుల పంటను మాత్రమే కొనుగోలు చేయాలని భావిస్తోందని, మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. పంటను కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల వర్షాల కారణంగా పంట దెబ్బతింటుందని, దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. అనంతరం జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ సందర్శించారు. -మిగతా 3 లో



## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

- పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి, తెలంగాణను విస్మరిస్తే ఎలా
- ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వక పోవడం వివక్షే
- ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం సరికాదు
- నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమే
- పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా
- ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి

రాజన్నసిరిసిల్ల, 05మే (మహాప్రభ )
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాట్రమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని -మిగతా 3 లో




## బెంగాల్లో నేను ఓడిపోలేదు... రాజీనామా చేయను

- బిజెపి కుట్రలతో గెలిచింది..
- తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- ప్రధాన విలన్ ఎన్నికల కమిషనర్
- 100పైగా సీట్లు లూటీ చేశా
- మమతా బెనర్జీ వ్యాఖ్యలు

కోల్‌కతా,
పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. -మిగతా 3 లో





## పుదుచ్చేరి సీఎంగా మళ్లీ రంగస్వామి!..

- ఐదవసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధం

చెన్నై, 05మే (మహాప్రభ )
శాంత స్వభావం, మృదుభాషిగా పేరొందిన ఎన్ రంగస్వామి.. పుదుచ్చేరి సీఎంగా ఐదవసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఏప్రిల్ 9న జరిగిన ఎన్నికల్లో ఆయన పార్టీ ఏఐఎన్ఆర్సీ నేతృత్వంలోని ఎన్డీయే ఘన విజయాన్ని అందుకుంది. పోటీ చేసిన 16 స్థానాల్లో ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలను గెలుచుకుంది. 10 స్థానాల్లో పోటీచేసిన బీజేపీ నాలుగింటిని కైవసం చేసుకుంది. కేవలం 30 మంది సభ్యులున్న పుదుచ్చేరి అసెంబ్లీలో మెజారిటీ మార్క్-16 కాగా, ఎన్డీయే కూటమి 18 చోట్ల విజయం సాధించింది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండియా కూటమి ఆరు స్థానాలకు పరిమితమైంది. డీఎంకే ఐదు స్థానాలు,
-మిగతా 3 లో

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

### కాంగ్రెస్ పెద్దలను కలవనున్న రేవంత్

- మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు అనుమతులపై దృష్టి సారించనున్న సీఎం
- కేరళలో యూడీఎఫ్ విజయం నేపథ్యంలో రేవంత్ పర్యటనకు మరింత ప్రాధాన్యత



హైదరాబాద్ 05మే (మహాప్రభ )
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, -మిగతా 3 లో


# యూఏఈపై ఇరాన్ దాడులు..

- ఖండించిన ప్రధాని మోదీ..
- ఆమోదయోగ్యం కాదని ప్రకటన



**న్యూఢిల్లీ -05మే (మహాప్రభ )**
యూఏఈలోని ఫ్యుజైరా ఆయిల్ హబ్‌పై ఇరాన్ దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఇరాన్ జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. ఈ ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా దాడుల్ని ఖండిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.యూఏఈలోని ఫ్యుజైరా ఆయిల్ హబ్‌పై ఇరాన్ జరిపిన దాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. పౌరుల్ని, సాధారణ నిర్మాణాల్ని లక్ష్యంగా చేసుకుని దాడులు జరపడం ఆమోదయోగ్యం కాదు. ఈ క్లిష్ట సమయంలో యూఏఈకి ఇండియా మద్దతుగా ఉంటుంది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యల్ని పరిష్కరించుకునేందుకు చర్చలు, దౌత్యపరమైన మార్గాలే ముఖ్యమని ఇండియా మరోసారి చెబుతోంది. ఈ ప్రాంతంలో శాంతి ప్రక్రియ కోసం హోర్ముజ్ నుంచి నిరాటంకమైన, సురక్షితమైన ప్రయాణం అవసరం. అప్పుడే ఇంధన భద్రత కోసం ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం సాధ్యమవుతాయి" అని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.మరోవైపు ఈ దాడుల్ని ఖండిస్తూ అంతకుముందు భారత విదేశాంగ శాఖ కూడా ఒక ప్రకటన చేసింది. ఇలాంటి దాడులు సరికాదని పేర్కొంది. యూఏఈలోని ఆయిల్ హబ్‌పై ఇరాన్ దాడి చేయగా, ముగ్గురు భారతీయ కార్మికులకు గాయాలయ్యాయి. వారికి తగిన వైద్య సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని అక్కడి భారతీయ రాయబార కార్యాలయ అధికారులు ప్రకటించారు. ఒకపక్క కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ ఇరాన్ ఈ దాడి చేయడం విశేషం.

# తిరుచ్చి నియోజకవర్గానికి రాజీనామా చేయనున్న విజయ్..!



**న్యూఢిల్లీ -05మే (మహాప్రభ )**
తమిళనాడులో ఎవరు ఊహించిన రీతిలో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిన టీవీకే చీఫ్ విజయ్ త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నాడు. టీవీకే మొత్తం 234 స్థానాల్లో 107 సీట్లను గెలుచుకొని విజయ ఢంకా మోగించింది. ఈ నేపథ్యంలో విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గవర్నర్‌కు రాజేంద్ర విశ్వనాథన్ అర్లేకర్‌కు లేఖ కూడా రాశారు. 108 స్థానాలతో టీవీకే సింగిల్ లార్జెస్ట్ పార్టీ అవతరించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.కాగా, విజయ్ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి (తూర్పు) అనే రెండు చోట్ల నుంచి పోటీ చేసి గెలుపొందారు. చట్ట ప్రకారం ఒక వ్యక్తి ఒకేసారి రెండు స్థానాల్లో ఎమ్మెల్యేగా ఉండకూడదు, అందుకే ఒక సీటుకు రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తిరుచ్చి ఈస్ట్‌కు రాజీనామా చేసి పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగనున్నట్లు సమాచారం. దీంతో త్వరలోనే ఆ స్థానానికి ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది.

# బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్ర పరిశీలకుడిగా అమిత్ షా..

- అసోంకు జేపీ నడ్డా



**న్యూఢిల్లీ -05మే (మహాప్రభ )**
పశ్చిమ బెంగాల్, అసోంలలో బీజేపీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది. బెంగాల్ సీఎం ఎవరూ అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాను నియమించింది బీజేపీ అధిష్టానం. అలాగే, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీని సహ పరిశీలకుడిగా నియమించింది. అమిత్ షా, మోహన్ చరణ్ ఆధ్వర్యంలో బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు, అగ్రనేతలు సమావేశమవుతారు. బెంగాల్ బీజేపీ లెజిస్లేటివ్ నేతను ఎన్నుకుంటారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నుకోవడం, కొత్త ప్రభుత్వ ఏర్పాటును షా, మోహన్ పర్యవేక్షిస్తారు. బెంగాల్‌లో ఈ నెల 9న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 207 సీట్లు గెలుచుకుంది. మరోవైపు అసోంకు సంబంధించి ప్రభుత్వ ఏర్పాటుకోసం కేంద్ర పరిశీలకుడిగా కేంద్ర మంత్రి, బీజేపీ మాజీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను బీజేపీ నియమించింది. నడ్డాతోపాటు సహపరిశీలకుడిగా హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైని వ్యవహరిస్తారు. వీరు ఇద్దరూ అసోంలో బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటు, లెజిస్లేటివ్ పార్టీ లీడర్ ఎన్నికను పర్యవేక్షిస్తారుఅసోంలో బీజేపీ కూటమి 82 సీట్లు గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తొలిసారి అధికారం చేపట్టబోతుంది. దీంతో ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో ఆసక్తి నెలకొంది. బీజేపీ అధిష్టానం ఎవరిని నియమిస్తుందో చూడాలి. ప్రస్తుతానికి సువేందు అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అసోంలో ఇప్పటికే బీజేపీ నుంచి సీఎంగా ఉన్న హిమంత బిశ్వ శర్మ అదే పదవిలో కొనసాగుతారు.

# నిన్న పని మనిషి.. నేడు ఎమ్మెల్యే..


- పశ్చిమ బెంగాల్‌లో సంచలనం సృష్టించిన మహిళ



**న్యూఢిల్లీ -05మే (మహాప్రభ )**
రాజకీయాల్లో రాణించాలంటే డబ్బు ఉండాల్సిందే అనుకుంటారు చాలా మంది. కానీ, ఈ అభిప్రాయం తప్పని నిరూపించింది ఒక పేద మహిళ. కొద్దిరోజుల క్రితం వరకు ఇళ్లల్లో పని మనిషిగా చేసిన మహిళ ఇప్పుడు ఎమ్మెల్యేగా ఎన్నికైంది. భారీ మెజారిటీతో బీజేపీ తరఫున గెలిచి, అసెంబ్లీలో అడుగుపెట్టబోతుంది. అధికార టీఎంసీ అభ్యర్థిని ఓడించి చరిత్ర సృష్టించింది. ఇదంతా జరిగింది పశ్చిమ బెంగాల్‌లో. ఆమె పేరు కలితా మాఝీ. ఈమె తాజాగా ఔస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు.బెంగాల్‌లోని గుస్కారా మున్సిపాలిటీకి చెందిన కలితా మాఝీ.. స్థానికుల ఇళ్లల్లో పని మనిషిగా చేసేది. నాలుగైదు ఇళ్లల్లో పని చేస్తూ నెలకు రూ.2,500 నుంచి రూ.4,000 వరకు సంపాదించేది. ఆమె భర్త ఒక పైప్ మెకానిక్. వీరికి ఎనిమిదో తరగతి చదివే బాబు ఉన్నాడు. కలితాకు రాజకీయాలంటే ఆసక్తి. ఈ ఇష్టంతోనే ఈమె 2021లో ఎమ్మెల్యేగా పోటీ చేసింది. అయితే, అప్పట్లో టీఎంసీ అభ్యర్థి అబేధానంద తాండర్ చేతిలో దాదాపు 11,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయినప్పటికీ, తాజాగా జరిగిన ఎన్నికల్లో ఆమెకు మరోసారి ఔస్‌గ్రామ్ బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. దీంతో రెండోసారి కూడా ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఆమెకు మద్దతుగా ప్రధాని మోదీ కూడా ప్రచారం నిర్వహించారు. ఆమె పేద, బలహీన వర్గాలకు ప్రతీక అని ప్రచారం సందర్భంగా మోదీ అన్నారు.దీంతో కలితాకు మంచి ప్రచారం లభించింది. ఈ ఎన్నికల్లో ఆమె టీఎంసీ అభ్యర్థి శ్యామ ప్రసన్న లోహార్‌పై 12,535 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. ఆమెకు 1,07,692 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికలకు ముందు ఒక పనిమనిషిగా చేసిన సాధారణ మహిళ.. ఈరోజు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం ఒక సంచలనమే. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో అధికార పార్టీ విజయంలో కలిత కూడా భాగస్వామిగా ఉన్నారు. మరో రెండు రోజుల్లో బెంగాల్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరబోతుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ 294 సీట్లకుగాను, 206 సీట్లు సాధించింది.

# టీవీకే శాసనసభాపక్ష నేతగా విజయ్..

- పొత్తు కోసం ఎవరినీ అడగబోం.. టీవీకే ప్రకటన



**న్యూఢిల్లీ -05మే (మహాప్రభ )**
తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ మెజారిటీకి కొద్ది దూరంలో ఉంది. ఇదే సమయంలో పార్టీ లెజిస్లేటివ్ లీడర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటుకు కొన్ని సీట్లు తక్కువగా ఉన్న అంశాన్ని నేతలు ప్రస్తావించారు.ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ.. రాజకీయపరంగా ఆత్మగౌరవం విషయంలో తమ పార్టీ రాజీపడబోదన్నారు. పొత్తు విషయంలోనూ తమ పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని ఆ పార్టీ నేతలు తెలిపారు. అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతు కోసం తమ పార్టీ ఎవరినీ అడుక్కోబోదని తెలిపారు. ఇక, మెజారిటీ నిరూపించుకునేందుకు టీవీకే నేతలు గవర్నర్‌ను కలిసి 15 రోజుల సమయం కోరారు. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో టీవీకే 108 సీట్లు సాధించి, అతిపెద్ద పార్టీగా మారింది. అధికారం చేపట్టాలంటే మరో 10 సీట్లు అవసరం. టీవీకేకు 35 శాతం ఓట్లు పోలయ్యాయి. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు కోసం టీవీకే ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు కాంగ్రెస్‌తో రాయబారం నడుస్తోందని తెలుస్తోంది. విజయ్ తండ్రి చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారు. విజయ్ పార్టీ టీవీకే అధికారం చేపట్టాలంటే పొత్తు పెట్టుకోక తప్పని పరిస్థితి. విజయ్ ఎవరితో పొత్తువైపు మొగ్గు చూపుతారో తెలియాలి.

# బిహార్‌లో మంత్రివర్గ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు..

-బీజేపీకి 12, జేడీయూకు 11 పదవులు..?



**న్యూఢిల్లీ -05మే (మహాప్రభ )**
బిహార్‌లో సీఎంగా నితీష్ కుమార్ రాజీనామా అనంతరం సామ్రాట్ చౌదరి ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన సంగతి తెలిసిందే. బీజేపీ నుంచి సామ్రాట్ సీఎంగా ప్రమాణం స్వీకారం చేశారు. జేడీయూ నుంచి విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ డిప్యూటీ సీఎంలుగా ఎన్నికైన సంగతి తెలిసిందే. గత నెలలోనే బీజేపీ, జేడీయూ ఆధ్వర్యంలో ఎన్‌డీయూ కూటమి నుంచి ప్రభుత్వ ఏర్పాటు పూర్తికాగా, ఇప్పుడు మంత్రివర్గ ఏర్పాటుకు ముహూర్తం ఖరారైంది.మే 7, గురువారం మంత్రివర్గ విస్తరణ జరగబోతున్నట్లు తెలుస్తోంది. మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం బిహార్ రాజధాని పాట్నాలోని ప్రఖ్యాత గాంధీ మైదాన్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది కూటమి ప్రభుత్వం కాబట్టి, ఏ పార్టీకి ఎన్ని మంత్రి పదవులు కేటాయిస్తారు అనే ఆసక్తి నెలకొంది. నిబంధనల ప్రకారం బిహార్ అసెంబ్లీలో ముఖ్యమంత్రితో కలిసి 36 మందికి మంత్రులుగా అవకాశం ఉంది. తాజా సమాచారం ప్రకారం.. బీజేపీకి 12 మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నాయి. అలాగే, కూటమిలో కీలక పార్టీ అయిన జేడీయూకు 11 మంత్రి పదవులు, రామ్ విలాస్‌కు చెందిన ఎల్‌జేపీకి 2 పదవులు, హెచ్‌ఏఎం, ఆర్‌ఎల్‌ఎం పార్టీలకు చెరో మంత్రి పదవికి అవకాశం ఉంది.ఇంకో ఆరు మంత్రి పదవులకు అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ పదవుల్ని మాత్రం భర్తీ చేయడం లేదు. తర్వాతి మంత్రివర్గ విస్తరణలో ఆరు పదవుల్ని భర్తీ చేస్తారు. జేడీయూలో కీలక నేతలైన శ్వేతా గుప్తా, భగవన్ కుష్వాహా, రత్నేష్ సదా, షీలే మండల్, బూలో మండల్‌లకు పదవులు ఖాయంగా కనిపిస్తోంది. మంత్రివర్గ ఏర్పాటుపై ఇటీవల బిహార్ సీఎం సామ్రాట్ చౌదరి.. ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. మంత్రివర్గం చర్చించి, ఆయన ఆమోదం తీసుకున్నారు. బిహార్‌లో ఎన్‌డీయే కూటమి 201సీట్లు కలిగి ఉంది. ఇందులో అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీకి 88 సీట్లు, జేడీయూకు 85 సీట్లున్నాయి.

# అమెరికా విమానం మిస్సింగ్..

-ఖతార్ పరిధిలో కనిపించకుండా పోయిన ఫ్లయింగ్ గ్యాస్ స్టేషన్




**న్యూఢిల్లీ -05మే (మహాప్రభ )**
గాలిలోనే ఇంధనం నింపగల సామర్థ్యం ఉన్న అమెరికాకు చెందిన విమానం ఒకటి కనిపించకుండా పోయింది. బోయింగ్ కేసీ--135 స్ట్రాటోట్యాంకర్ అనే ఫ్లయింగ్ గ్యాస్ స్టేషన్‌గా పిలిచే విమానం ఇరాన్ సమీపంలోని పర్షియన్ గల్ఫ్ తీరంలో ప్రయాణిస్తుండగా గల్లంతైంది. గల్లంతు కావడానికి కొద్దిసేపటి ముందు ఎమర్జెన్సీ సిగ్నల్ అందించింది. ఒకపక్క మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ సంక్షోభం నెలకొన్నదృష్ట్యా ఈ విమానం కనిపించకుండా పోవడం ఆసక్తికరంగా మారింది.ఈ అమెరికా విమానం యూఏఈలోని అల్ దఫ్రా ఎయిర్‌బేస్ నుంచి బయల్దేరింది. ఖతార్ వద్ద ప్రయాణిస్తున్నప్పుడు సిగ్నల్ కోల్పోయింది. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ సంక్షోభం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గల్ఫ్, ఇరాన్ ప్రాంతంలో మోహరించిన అమెరికా యుద్ధ విమానాలకు ఇంధనం నింపేందుకు ఈ విమానం సాయపడుతోంది. విమానం కనిపించకుండా పోవడానికి లేదా ఎక్కడైనా ఎమర్జెన్సీ ల్యాండింగ్ అవ్వడానికి ముందు గాలిలో కొద్దిసేపు గుండ్రంగా తిరిగినట్లు డాటా ద్వారా వెల్లడవుతోంది. ఈ విమానం కనిపించకుండా పోవడానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. దీనిపై అమెరికా నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.అలాగే, ఈ ఘటనలో తమ ప్రమేయం గురించి ఇరాన్ కూడా ఎలాంటి ప్రకటనా చేయలేదు. అమెరికా మిలిటరీ కూడా దీనిపై స్పందించలేదు. గత మార్చిలో ఇరాన్ జరిపిన దాడుల్లో ఇలాంటి మరో కేసీ--135 విమానాన్ని అమెరికా ఇరాక్ భూభాగంలో కోల్పోయింది. తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి ఈ దాడి చేశామని ఇరాక్ ప్రకటించింది. ఈ విమానం అమెరికన్ ఆర్మీకి చాలా కీలకమైంది. గాలిలోనే యుద్ధ విమానాల్లో ఇంధనం నింపగలదు. అలాగే, సామగ్రిని, ప్రయాణికుల్ని కూడా మోసుకెళ్లగలదు. ఈ తరహా విమానాలు అమెరికా రక్షణ రంగంలో 60 ఏళ్లుగా సేవలందిస్తున్నాయి.

# సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 37కు పెంపు

**న్యూఢిల్లీ -05మే (మహాప్రభ )**
సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 37కు పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు -- 2026ను పార్లమెంట్ లో పెట్టే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ బిల్లుతో ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) కాకుండా ప్రస్తుతం న్యాయమూర్తుల సంఖ్య 34 --37 (కొత్తగా నలుగురు న్యాయమూర్తులు ) పెంచడానికి వీలుకలుగుతుంది. న్యాయమూర్తుల సంఖ్య పెంపుతో సుప్రీంకోర్టు మరింత సమర్థవంతంగా, వేగవంతమైన న్యాయం అందించడానికి దోహదపడుతుందని కేంద్రం




పేర్కొంది. ఈ నలుగురు న్యాయమూర్తులు, సహాయక సిబ్బంది జీతాలు, ఇతర సౌకర్యాలకు అయ్యే ఖర్చును భారత సంఘటిత నిధి నుంచి కేటాయించనున్నారు. సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) 1960 చట్ట ప్రకారం జడ్జిల గరిష్ఠ సంఖ్యను 10గా నిర్ణయించారు. అనంతరం 1960 చట్ట సవరణతో జడ్జిల సంఖ్యను 13కి, 1977 సవరణతో 17కి పెంచారు. సిజెఐను మినహాయించి.. సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్యను కేంద్ర కేబినెట్ 1979 చివరల్లో 15 మందికి పరిమితం చేసింది. ఆ తర్వాత సిజెఐ అభ్యర్థన మేరకు ఈ పరిమితిని తొలగించారు. 1986 సవరణతో జడ్జిల సంఖ్యను 17 నుంచి 25కు పెంచారు. 2008లో చేసిన చట్ట సవరణతో 25 నుంచి 30, చివరగా 2019లో సవరణతో 33కు పెంచారు. కేబినెట్ తాజా నిర్ణయంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 37కు పెరగనుంది.

## భారతీయుల రక్తం చిందితే.. సహించం

**-ఇరాన్‌కు ఇండియా స్ట్రాంగ్ వార్నింగ్**
**-యూఏఈపై ఇరాన్ డ్రోన్ దాడి**
**-ముగ్గురు ఇండియన్స్‌కు గాయాలు**
**-తీవ్రంగా పరిగణించిన భారత్**



**న్యూఢిల్లీ,**
యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లోని ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్ పై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిని భారత్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనలో ముగ్గురు భారత పౌరులు గాయపడటం పట్ల కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి దాడులు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, హింసను తక్షణమే ఆపాలని అంతర్జాతీయ సమాజానికి భారత్ విజ్ఞప్తి చేసింది. ఫుజైరా చమురు పరిశ్రమ ప్రాంతంపై జరిగిన డ్రోన్ దాడిలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు భారతీయ కార్మికులకు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానిక అధికారులు వారిని ఆసుపత్రికి తరలించారు. యూఏఈ లోని భారత రాయబార కార్యాలయం నిరంతరం స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతూ, బాధితులకు అందుతున్న చికిత్సను పర్యవేక్షిస్తోంది. యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఇరాన్ మొత్తం నాలుగు క్షిపణులను ప్రయోగించింది. వీటిలో మూడింటిని యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకోగా, ఒకటి సముద్రంలో పడిపోయింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలు వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్నే పాటించాలని అధికారులు సూచించారు.

## మా నౌకలపై దాడి చేస్తే తుడిచిపెడతాం

మొదటి తరువాయి

డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. ఇరాన్ వైపు నుంచి దూసుకొచ్చిన 19 క్షిపణులు, డ్రోన్లను తన గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని, డ్రోన్ దాడిలో ఫుజైరా ప్రాంతంలోని చమురు ఓడరేవు వద్ద మంటలు వ్యాపించాయని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) తెలిపింది. పర్షియన్ గల్ఫ్‌లో తమ నౌకలపై దాడి చేస్తే ఈ భూమి పైనే లేకుండా తుడిచిపెడతానని ఇరాన్ దళాలను ట్రంప్ హెచ్చరించారు.



**రాజకీయ సంక్షోభానికి సైనిక పరిష్కారం ఉండదు : ఇరాన్**

రాజకీయ సంక్షోభానికి సైనిక పరిష్కారం ఉండదని హర్మూజ్ లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు నిరూపిస్తున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ చెప్పారు. దుందుడుకు చర్యలకు పాల్పడితే ఊబిలో కూరుకుపోతారని ఆయన అమెరికా, యుఎఇలను హెచ్చరించారు. పాకిస్తాన్‌తో జరుపుతున్న చర్చలు పురోగతిలో ఉండగానే అమెరికా ఊబిలోకి దిగుతోందని, దాని మిత్రదేశం యుఎఇ కూడా అదే పని చేస్తోందని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి నౌకలను బయటికి పంపే విషయంలో సాయపడడానికి అమెరికా ముందుకు తెచ్చిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' ప్రణాళికను ఆయన ఎద్దేవా చేశారు.

**ఆమోదయోగ్యం కాదు : కేంద్రం**

యుఎఇలోని ప్రధాన చమురు ఓడరేవుపై జరిగిన దాడిలో ముగ్గురు భారత జాతీయులు గాయపడడంపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఈ చర్య ఆమోదయోగ్యం కాదని తెలిపింది. 'శత్రుత్వానికి వెంటనే స్వస్తి చెప్పాలని, పౌర మౌలిక సదుపాయాలను, ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం ఆపేయాలని కోరుతున్నాం' అని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్యను పరిష్కరించుకోవాలన్న తన వైఖరిని పునరుద్ఘాటించింది.

మంటల్లో చిక్కుకున్న దక్షిణ కొరియా నౌక

దక్షిణ కొరియాకు చెందిన ఓ నౌక సోమవారం హర్మూజ్‌లో మంటలలో చిక్కుకుంది. అంతకుముందు నౌకలో పేలుడు సంభవించింది. నౌకను తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు సమీపంలోని ఓడరేవుకు తరలిస్తున్నారు. అగ్నిప్రమాదానికి కారణమేమిటో తెలుసుకునేందుకు విచారణ జరుపుతున్నామని సియోల్ విదేశాంగ శాఖ తెలిపింది

## మక్కల కొనుగోళ్లలో కావాలనే జాప్యం

మొదటి తరువాయి

అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 15 నుంచి 20 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన కేటీఆర్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.



ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.22,000 కోట్ల అప్పులు తీసుకువచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా అక్కడి నుంచి నిధులు రాకపోవడంతో, మార్క్‌ఫెడ్ నిధులను వాడుకుంటున్నారని చెప్పారు. తాను చెప్పిన లెక్కలు తప్పైతే ప్రభుత్వం రుజువు చేయాలని సవాల్ విసిరారు. రైతులను ఇలాగే ఇబ్బందులకు గురి చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రేపటి వరకు గడువు ఇస్తున్నామని తెలిపారు. లేకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

## శాసనసభా పక్ష నేతగా విజయ్ ఎన్నిక

మొదటి తరువాయి



అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతు కోసం తమ పార్టీ ఎవరినీ అడుక్కోబోదని తెలిపారు. ఇక, మెజారిటీ నిరూపించుకునేందుకు టీవీకే నేతలు గవర్నర్‌ను కలిసి 15 రోజుల సమయం కోరారు. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో టీవీకే 108 సీట్లు సాధించి, అతిపెద్ద పార్టీగా మారింది. అధికారం చేపట్టాలంటే మరో 10 సీట్లు అవసరం. టీవీకేకు 35 శాతం ఓట్లు పోలయ్యాయి. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు కోసం టీవీకే ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు కాంగ్రెస్‌తో రాయబారం నడుస్తోందని తెలుస్తోంది. విజయ్ తండ్రి చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారు. విజయ్ పార్టీ టీవీకే అధికారం చేపట్టాలంటే పొత్తు పెట్టుకోక తప్పని పరిస్థితి. విజయ్ ఎవరితో పొత్తువైపు మొగ్గు చూపుతారో తెలియాలి.

## ఎన్నికల ఫలితాలు.. తారుమారు!

మొదటి తరువాయి



ఇది బీజేపీకి తెలిసిన పాత వ్యూహమేనని, గతంలో మధ్యప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర రాష్ట్రాలతో పాటు 2024 లోక్ సభ ఎన్నికల్లో కూడా ఇదే తరహా పద్ధతిని చూశామని పేర్కొన్నారు. "ఎన్నికలను దొంగిలించడం, ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేయడం.. ఇక వాళ్లకు మిగిలిన దారి ఏముంది!" అని రాహుల్ తన పోస్టులో ప్రశ్నించారు. బీజేపీ కేవలం ఎన్నికలనే కాకుండా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వ్యవస్థల విశ్వసనీయతను కూడా దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

మొదటి తరువాయి


నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి



తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ఎ÷-లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించిన ప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర (ఓ÷ూఖ) కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## సీఎం పదవికి స్టాలిన్ రాజీనామా..

**-గవర్నర్ ఆమోదం**



చెన్నై:
అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ తమిళనాడు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ ఆఫీసుకి పంపినట్టు డీఎంకే పార్టీ వర్గాలు మంగళవారం మీడియాకు తెలిపాయి. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే ఓటమిపాలైంది. దీంతో ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పనిచేస్తామని స్టాలిన్ ప్రకటించారు. ఇదిలా ఉండగా, ఆయన పంపిన రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్ ఆమోదించారు. ఈ మేరకు లోక్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది. తదుపరి ప్రభుత్వం ఏర్పడే వరకు ముఖ్యమంత్రి బాధ్యతల్లో కొనసాగాలని స్టాలిన్‌ను గవర్నర్ కోరారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

మొదటి తరువాయి

సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై విజ్ఞప్తులు చేయనున్నారు. పాలనాపరమైన అంశాలతో పాటు, ఏఐసీసీ అగ్రనేతలతో కూడా ముఖ్యమంత్రి సమావేశం కాబోతున్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సాధించిన అఖండ విజయం ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించి, కూటమి విజయానికి తనవంతు కృషి చేశారు. ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు రేసులో బలంగా వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి, వేణుగోపాల్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో, ఈ ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ సమీకరణాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

## పుదుచ్చేరి సీఎంగా మళ్లీ రంగస్వామి!..

మొదటి తరువాయి



కాంగ్రెస్ ఒక స్థానంలో గెలుపొందాయి. సిట్టింగ్ ఎంపీ, మాజీ సీఎం వీ వైతిలింగంతో సహా కాంగ్రెస్ అభ్యర్థుల్లో చాలామంది ఓటమిపాలయ్యారు. కొత్తగా ఆవిర్భవించిన టీవీకే రెండు సీట్లు గెలుచుక

## బెంగాల్లో నేను ఓడిపోలేదు... రాజీనామా చేయను

మొదటి తరువాయి



లోక్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారంనాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..ఇసి, బిజెపిలపై ఘాటు విమర్శలు చేశారు. బిజెపి కనుసన్నల్లో ఇసి పనిచేసిందన్నారు. అమిత్ షా, ప్రధాని మోడీలు కలసి కటు÷-రలు చేశారని మండిపట్టారు. 'ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీ చేశారు' అని మమత ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు పోలింగ్ ముగిసిన తర్వాత కూడా 80 నుంచి 90 శాతం కంటే ఎక్కువ బ్యాటరీని కలిగి ఉండటం ఏమిటని ప్రశ్నించారు. పోలింగ్‌కు రెండ్రోజుల ముందే అధికారులు తమ పార్టీపై దాడులు, కార్యకర్తల అరెస్టులు చేశారని అన్నారు. భవనీపూర్‌లో ఉద్దేశపూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని అన్నారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. ఈ మొత్తం ఉదంతంలో 'ఇండి' కూటమి తన వైపే ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తనతో మాట్లాడారని, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, హేమంత్ సోరెన్ తదితరులు ఫోను చేసి సపోర్ట్‌గా నిలిచారని చెప్పారు. 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు.

## దేవరకొండ మున్సిపాలిటీ నూతన కమిషనర్ రామ్ దుర్గా రెడ్డి కి ఘన సత్కారం

-సామాజిక వేత శ్రీ ని వాస్ గౌడ్



**దేవరకొండ మే 05(' మహా ప్రభ)**
దేవరకొండ మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా విచ్చేసిన రామ్ దుర్గా రెడ్డి నీ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను కలిసి మెమొంటో అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు . మీరు మారుమూల ప్రాంతమైన దేవరకొండ ప్రాంతానికి రావడం చాలా సంతోషదాయకం అన్నారు. మీరు ఈ ప్రాంతంలో పేద వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తూ పేదలను అక్కున చేర్చుకునే విధంగా ఉండాలని మా వంతుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, రెడ్డి కోటేశ్వరరావు, అంకం చంద్రమౌళి,లావుడి బాషా చౌహన్,పున్న వెంకటేష్ నేత, భీమవరం శివ గౌడ్, బొమ్మిడి వెంకటయ, పున్న బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు

### లారీలు, కొరత లేకుండా తూకంలో
## మిల్లర్ల మోసాని అరికట్టాలి

-సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్



**దేవరకొండ డివిజన్ మే 5( మహా ప్రభ )**
నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి, లారీలు కొరత లేకుండా చూడాలని, తూకంలో మిల్లర్ల మోసాన్ని అరికట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొండ మల్లేపల్లి మండల చిన్న అడిశెల్లపల్లి కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు కొనుగోలు కేంద్రాలలో కూడా అన్యాయాన్నికి గురకావడం ఏంటని ప్రశ్నించారు.మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని పంపడానికి లారీలు లేవనే సాకుతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలో రైతులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్స్ దగ్గరికి చేరుకున్న ధాన్యాన్ని క్వింటా కు రెండు నుండి నాలుగు కేజీలు తరువు తీస్తున్నారని మిల్లు యజమానులపై చర్య తీసుకోవాలని, సంబంధిత అధికారులు నీమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, అధికారులు జోక్యం చేసుకొని పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరిగేటట్లు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ప్రశ్నిస్తే తాలుందని నూకలు అవుతున్నాయని రకరకాల కారణాలు చెప్పి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వ్యాపారులు గ్రామాల్లో రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసి మార్కెట్లో రైతుల పేరుతో అమ్ముతున్నా మాది రైతు ప్రభుత్వం ప్రతి గింజ కొంటామని గొప్పలు పలికిన సర్కారుకు రైతుల సమస్యలు అర్థం కావడం లేదని ప్రశ్నించారు ధాన్యం కొనుగోలు లో జరుగుతున్న జాప్యం రైతులను మోసం చేస్తున్న విధానానికి వ్యతిరేకంగా ఈనెల 11న జరిగే కలెక్టరేట్ ధర్నాకు రైతంగం పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కావలి కృష్ణయ్య రైతులు పాల్గొన్నారు

## కైతలాపూర్ డివిజన్ అంజయ్య నగర్ కాలనీ సమస్యలపై బండి రమేష్‌ను కలిసిన కాలనీవాసులు






**కూకట్పల్లి, మే 05( మహ ప్రభ)**
కూకట్పల్లి నియోజకవర్గంలోని కైతలాపూర్ డివిజన్ అంజయ్య నగర్ కాలనీ వాసులు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్‌ను కలిశారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేకంగా కాలనీలో ఉన్న పార్కులు, పార్కింగ్ సమస్యల గురించి వివరించి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. గత 20 సంవత్సరాలుగా కబ్జాకు గురైన పార్కును హైడ్రా ద్వారా విముక్తి కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు బండి రమేష్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేస్తూ సన్మానం చేశారు. అదేవిధంగా కాలనీలో ఉన్న సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీ అభివృద్ధి కోసం సహకరించిన సునీల్ కుమార్ యాదవ్‌కు కాలనీవాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## నగల వ్యాపారులు, బ్యాంకు అధికారులతో భద్రతపై అవగాహన సమావేశం.

-నగల దుకాణాల్లో భద్రతా ప్రమాణాలు పెంచాలి
-మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్.




**మెదక్ జిల్లా -05మే (మహాప్రభ )**
కరీంనగర్‌లో ఇటీవల జరిగిన జ్యువెలరీ షాపు దోపిడీ ఘటన నేపథ్యంలో మెదక్ జిల్లాలో అప్రమత్త చర్యలు చేపట్టినట్లు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ తెలిపారు. ఈ నేపథ్యంలో తూప్రాన్ పట్టణంలోని మమత మినీ ఫంక్షన్ హాల్‌లో నగల దుకాణాల యజమానులు, గోల్డ్ వ్యాపారులు, పాన్ బ్రోకర్లు, బ్యాంకు అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ నగల దుకాణాల్లో అత్యున్నత నాణ్యత గల సీసీటీవీ కెమెరాలు, ఆటోమేటిక్ అలారం సిస్టమ్స్, యాక్సెస్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మెటల్ డిటెక్టర్లు అమర్చడం ద్వారా భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. దుకాణాల్లో జరిగే లావాదేవీలకు సంబంధించి సరైన రికార్డులు నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఇటువంటి దోపిడీ ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నేరాలను నివారించవచ్చని పేర్కొన్నారు.నగల దుకాణాల భద్రతపై పోలీసు అధికారులు తరచూ సమీక్ష నిర్వహించాలని, పగలు, రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీ నిర్వహిస్తూ నిఘాను పెంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు వెంకట రాజా గౌడ్, జాన్ రెడ్డి, రంగా కృష్ణ, తూప్రాన్ సబ్ డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

### కళ్యాణ లక్ష్మి పేదింటి
## ఆడబిడ్డలకు వరం

మెదక్ శాసనసభ్యులు మైనపల్లి రోహిత్ రావు.



**మెదక్ జిల్లా -05మే (మహాప్రభ )**
రామాయంపేట మండల కేంద్రంలో ని తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామాయంపేట మండలంలో మొత్తం 96 చెక్కులకు గాను 96,11,136 కోట్ల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు ఒక వరమని పేద కుటుంబాలపై పెళ్లి భారాన్ని తగ్గించడం కోసమే కళ్యాణ లక్ష్మి పథకం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.

## కోతుల సమస్య పరిష్కారం దిశగా చర్యలు



**హుస్నాబాద్, మే 05(' మహా ప్రభ)**
: హుస్నాబాద్ పట్టణంలో పెరుగుతున్న కోతుల సమస్యను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ పాలకవర్గం చర్యలు ప్రారంభించింది. సాయిబాబా గుడి వెనుక ప్రాంతంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సహకారంతో పట్టివేత కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని పురపాలక సంఘం చైర్‌పర్సన్ దండి లక్ష్మి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతులను సురక్షితంగా పట్టుకునేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. పట్టణంలో కోతుల సమస్యను పూర్తిగా నివారించేందుకు మరిన్ని చర్యలు చేపడతామని మున్సిపల్ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు కొండ రజిత, బత్తుల స్వరూప, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం తదితరులు పాల్గొన్నారు.ప్రజల సమస్యలకు స్పందిస్తూ కోతుల బెడద తగ్గించేందుకు మున్సిపల్ పాలకవర్గం ముందడుగు వేసింది.

## సాహెబ్ నగర్ త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర ఘనంగా ప్రారంభం

**బి.యన్. రెడ్డి నగర్, మే 05 ( మహా ప్రభ**
సాహెబ్ నగర్‌లో నిర్వహిస్తున్న శ్రీ త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర వేడుకలు భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బి.యన్. రెడ్డి నగర్ డివిజన్‌కు చెందిన జిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఈ జాతరను రంగురంగుల వైభవంతో నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. జాతరకు విచ్చేసే భక్తులందరికీ శ్రీ ఆంజనేయస్వామి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు చిన్న యాదవ్, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా రత్య తండా లో
## బేటి బచావో- బేటి పడావో

సూపర్వైజర్. డి. చిట్టెమ్మ






**దేవరకొండ మే 5 (మహాప్రభ )**
మండలంలోని రత్య తండాలో మంగళవారం భేటీ బచావో బి బేటి పడావో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ డి చిట్టెమ్మ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయరాదని ఆడపిల్లలు ఉన్నతమైన చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని, మహిళల హక్కులు, మారకద్రవ్యాల వినియోగం సైబర్ క్రైమ్ నేరాలపై.మిషన్ వాత్సల్య పథకం పై అక్రమ దత్తత పై చైల్డ్ హెల్ప్ లైన్ పై అవగాహన కల్పించడమైనది అదేవిధంగా విద్యార్థులు మంచిగా చదువుకోవాలని చెడు స్నేహాలకు, చెడు అలవాట్లకు, దూరంగా ఉండాలనిసూచించారు , చిన్నపిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వరాదని తెలియపరిచారుఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్త్య గోమి , ఉప సర్పంచ్ రామావత్ సునీత, పంచాయతీ సెక్రెటరీ మూర్తి, గణేష్, అంగన్వాడీ టీచర్స్,= సుజాత, = బుల్లి గ్రామంలోని కిషోర బాలికలు, తల్లులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు..

## ప్రధాని నరేంద్ర మోడి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ మను చౌదరి



**రంగారెడ్డి జిల్లా, మే 05 (మహాప్రభ )**
ఈ నెల 10వ తేదీన భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా ఇంచార్జీ కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగం చేపట్టవలసిన ఏర్పాట్లపై పలు సూచనలు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాని పర్యటన సందర్భంగా జిల్లాలో చేపట్టే ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, చిన్నపాటి లోపాలకూ తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, ట్రాన్స్‌పోర్ట్ శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### పిఎసిఎస్ చైర్మన్ గా బాధ్యతలు
## స్వీకరించిన శ్రీశైలం యాదవ్



**దేవరకొండ డివిజన్ మే 05 ( మహా ప్రభ**
**నియోజక వర్గం లో ని నేరడుగొమ్ము,మేజర్ న్యూస్:**-నేరడుగొమ్ము మండల కేంద్రంలో ఉన్న తిమ్మాపురం సొసైటీకి పిఎసిఎస్ చైర్మన్గా కొండ్ర శ్రీశైలం యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కోర్టు తీర్పు వెలువడించిన సందర్భంగా చైర్మన్ లను,డైరెక్టర్లను కొనసాగించాలని తీర్పు ఇచ్చింది.ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దుచేసి వారికి కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి ప్రమాణ స్వీకారం చేయాలని కోరింది.ఈ నేపథ్యంలో చైర్మన్గా,డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు.చైర్మన్ కొండ్ర శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యాన్ని సేకరించి వారికి సహకరించాలని కోరారు. ఎగుమతులు,దిగుమతులు త్వరగా కావాలని వర్షాల వల్ల ఇప్పటికే రైతులు ఇబ్బంది పడుతున్నారని కాబట్టి త్వరగా ఎక్కువ లారీలు పంపాలని ఎక్కువ వరి సేకరించే ప్రాంతాలు పేర్వాల,గుంటిపల్లి దగ్గరికి లారీలు ఎక్కువ పంపించాలని కలెక్టర్,ఎమ్మెల్యే బాలునాయక్ స్పందించి ఈ సమస్యను తీర్చాలని అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలం యాదవ్,వైస్ చైర్మన్ సంకెళ్లపల్లి వీరారెడ్డి, డైరెక్టర్ లు నాగిళ్ళ బాల్ రాం,నోముల లింగమయ్య, ఏదుర్ల సత్తిరెడ్డి,కాల్య,బద్రు, రామావత్ చంద్రమౌళి,గడ్డం వెంకటయ్య,మాతంగి సాయిలమ్మ,పేర్వాల సర్పంచ్ టేకులపల్లి నాగేష్,సీఓ రాజు, పృద్వి,వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ పీపీసీని సందర్శించిన జిల్లా కలెక్టర్





**కామారెడ్డి మే 5(మహాప్రభ)**
మంగళవారం జిల్లా కలెక్టర్ పాల్వంచ మండలంలోని పీఏసీఎస్ మాచారెడ్డి పరిధిలో కొనసాగుతున్న పాల్వంచ పీపీసీ, వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో వరి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుండగా, ఒక లారీ లోడింగ్ పూర్తయినట్లు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ డీసీవో, డీఎంసీఎస్, డీసీఎస్ఓ అధికారులకు తూకం ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతుల ధాన్యం త్వరితగతిన కొనుగోలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సరిపడా రవాణా సౌకర్యాలు కల్పించి, రైస్ మిల్లుల వద్ద వాహనాల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పీపీసీల వద్ద అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, వరి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. వరి కొనుగోలు పూర్తిగా ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం చేపట్టాలని, ధాన్యసేతు యాప్‌లో కొనుగోలు వివరాలను నమోదు చేయాలని, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. అలాగే కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలని, అన్‌లోడింగ్ అనంతరం వెంటనే ట్రక్ చిట్స్ తీసుకురావాలని, ట్యాబ్ ఎంట్రీలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యం, ధాన్య కుప్పలను వర్షాల నుండి రక్షించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీవో, డీసీఎస్ఓ, డీఎంసీఎస్, ఎంఎస్ఓ, ఫీల్డ్ ఆఫీసర్, తహసీల్దార్, డీటీసీఎస్, ఏఈఓ, సర్పంచ్, కార్యదర్శి, పీపీసీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**కామారెడ్డి, మే 5 (మహాప్రభ)**
చిన్నారిపై లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు 50,000 జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. దేవునిపల్లి పోలీసుల కృషితో బలమైన సాక్ష్యాధారాల ఆధారంగా నేరం రుజువై శిక్ష ఖరారైంది. పోలీసుల వివరాల ప్రకారం... దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ బాలిక కామారెడ్డిలోని ప్రైవేట్ కాలేజీలో చదువుకుంటుండగా, అదే కాలేజీలో చదువుతున్న తోకల రాజశేఖర్ (25) ఆమెను ప్రేమిస్తున్నానని వేధించేవాడు. బాలిక నిరాకరించినప్పటికీ, ఫోన్ నంబర్ సంపాదించి మాట్లాడకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు దిగాడు. వీడియో కాల్స్ సమయంలో రికార్డింగ్ చేసి దుర్వినియోగానికి ప్రయత్నించాడు. అనంతరం మాయమాటలు చెప్పి ఒంటరి ప్రదేశానికి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడి చేశాడు.బాధితురాలు విషయాన్ని తన తల్లికి



తెలియజేయడంతో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్ష్యాధారాలు, వైద్య నివేదిక ఆధారంగా నిందితుడిని అరెస్టు చేసి పోక్సో చట్టం కింద అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవడంతో జిల్లా న్యాయమూర్తి సీహెచ్.వీఆర్.ఆర్. వరప్రసాద్ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు.ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అప్పటి ఎస్‌హెచ్ఓ ఎం.జ్యోతి, రూరల్ సీఐ బి.శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శేషు, ప్రస్తుత సీఐ శ్రీధర్ గౌడ్, ఎస్‌హెచ్ఓ రంజిత్, కోర్టు లైజనింగ్ అధికారి ఏఎస్ఐ రామేశ్వర్ రెడ్డి, కానిస్టేబుల్ రవిని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర అభినందించారు. చిన్నారులు, మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇలాంటి నేరాలకు ఎటువంటి ఉపేక్ష ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు సమస్యలపై వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# నిజాంపేట్‌లో భక్తి ఉత్సాహంతో వైభవంగా ఎల్లమ్మ బోనాలు.

-బోనమెత్తిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా -05మే (మహాప్రభ ).**
మెదక్ జిల్లా నిజాంపేట్ మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బోనం ఎత్తుకుని ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.ఈ ఈ కార్యక్రమంలో నిజాంపేట్ బీఆర్ఎస్ మండల, పార్టీ అధ్యక్షులు సుధాకర్రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు అబ్దుల్ ఆజీజ్, నాయకులు స్వామిగౌడ్, దయాకర్, రాములు, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్,నాయిని లక్ష్మణ్, సదా శివలింగం,బండారి తిరుమల్, నాయిని వెంకటేశం, పంపరి శివ, బన్నీగౌడ్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు రంజిత్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు.

# బీజేపీ విజయోత్సవ సంబరాలు



**తాడ్వాయి, మే 5 (మహాప్రభ):**
పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా తాడ్వాయి మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యకర్తలు నినాదాలతో ఊరేగింపులు చేపట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజలు బీజేపీపై ఉంచిన విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. దేశాభివృద్ధి, సుసంపన్నత కోసం పార్టీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యెల్మ సంతోష్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు గంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు హోటల్ శ్రీను, వెంకట్‌రావు, మండల ఉపాధ్యక్షుడు సురకంటి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్సారెడ్డి, స్వామిరెడ్డి, డా.సదాశివుడు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు దత్తాద్రి, బూత్ అధ్యక్షులు కిషన్‌రావు, శ్రీకాంత్ రెడ్డి, రాజు, మహేష్, సీనియర్ నాయకులు బాపురెడ్డి, వెంకట్ రెడ్డి, ధర్మారెడ్డి, మల్లారెడ్డి, బండారి స్వామి, సంజీవ రెడ్డి, అనిల్, బాలాజీ, రాజు రెడ్డి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మే 10న మోదీ సభకు విజయవంతం చెయ్యాలని బీజేపీ నేతల పిలుపు

**కరీంనగర్,-05మే (మహాప్రభ ).**
మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ కరీంనగర్ బీజేపీ శ్రేణులు ప్రచారాన్ని ఉధృతం చేశాయి.ఈస్ట్ జోన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ 7వ డివిజన్‌లో బీజేపీ నాయకుడు వాడే వెంకట రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గోడపత్రికల కార్యక్రమం నిర్వహించారు. సభకు ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని గోడలపై నినాదాలు రాస్తూ



అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, ఈస్ట్ జోన్ నగర అధ్యక్షుడు అవుదుర్తి శ్రీనివాస్‌తో పాటు పలువురు డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.మోదీ సభ విజయవంతం కోసం బీజేపీ శ్రేణులు ప్రజల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నాయి.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**రామాయంపేట, మే 5 (మహాప్రభ)**
పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం 'కళ్యాణ లక్ష్మి' కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం రామాయంపేటలో జరిగింది. మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని 96 మంది లబ్ధిదారులకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం కుటుంబాలకు ఎంతో ఉపయుక్తమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ వార్డు సభ్యులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో చలివేంద్రాల ఏర్పాటు

- బాటసారులకు ఊరటనిచ్చిన సేవా కార్యక్రమం



**శేరిలింగంపల్లి, మే 05 (మహాప్రభ)**
శేరిలింగంపల్లిలో సేవా కార్యక్రమం నిర్వహించబడింది. అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో గురునాదం చెరువు సమీపంలో, అంగారా రెస్టారెంట్ వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ప్రారంభించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని మజ్జిగ, రాగిజావను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు. సామాజిక బాధ్యతతో చేపట్టిన ఈ చొరవపై స్థానిక ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. వేసవి వేడిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చిన రామప్రభు సేవాభావం అభినందనీయం.

# ఎల్లమ్మ ఉత్సవాల్లో బీఆర్ఎస్ ఇంచార్జ్ కంట రెడ్డి తిరుపతి రెడ్డి

**రామాయంపేట, మే 5 (మహాప్రభ)**
నిజాంపేట మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన రేణుకా మాత--జమదగ్ని మునిరాజు కళ్యాణ మహోత్సవాల్లో మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కంఠరెడ్డి తిరుపతి రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షం ప్రజలందరిపై ఉండాలని





కోరుకుంటూ, ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మాజీ మున్సిపల్ చైర్మన్ మాణిక్ రెడ్డి, కౌన్సిలర్ జితేందర్ గౌడ్, మద్దెల రమేష్, బాసం శ్రీనివాస్, కల్వకుంట గ్రామ సర్పంచ్ అందే కొండల్ రెడ్డి, రాజాక్‌పల్లి సర్పంచ్ కనకరాజు, నిజాంపేట మండల యూత్ అధ్యక్షుడు నరసింహులు, బజార్ మల్లేశం, బన్నీ గౌడ్, పెద్ద నారగౌడ్, చిన్న నారగౌడ్, వెంకటేష్, గోపాల్ రెడ్డి, సోమ్లా నాయక్, దుర్గయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా గ్రీవెన్స్ డే శుభసూచకం

-రెవెన్యూ డివిజన్లో ఆర్డీవో రమణారెడ్డి ని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపిన బీసీ సంక్షేమ సంఘం డివిజన్ నాయకులు

**దేవరకొండ డివిజన్ మే 4 ( మహాప్రభ)**
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీవో ఆఫీస్ కు వెళ్లి ఆర్డీవో రమణారెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రీవెన్స్ డేవిజన్లో ఏర్పాటు చేయడం శుభదాయకమని కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను శాలువతో సత్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి అన్ని రెవెన్యూ డివిజన్లో ఏర్పాటుచేసి ప్రజల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఈ కార్యక్రమం మంచిదని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రివర్యులు యనమల రేవంత్ రెడ్డి గారికి, మంత్రి మండలి సభ్యులకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రీవెన్స్ డే లో అధికారులు ప్రజల సమస్యలపై అవగాహన కలిగి శాశ్వత పరిష్కార దిశగా కృషి చేయాలని ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే అధికారులు ప్రభుత్వము ప్రజల యొక్క మన్ననలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, రామావత్ రాజు నాయక్, కంబాలపల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# ప్రధాని పర్యటన ఏర్పాట్లలో అప్రమత్తత అవసరం

**- జిల్లా ఇంచార్జి కలెక్టర్ మను చౌదరి**



**రంగారెడ్డి, మే 05(' మహా ప్రభ)**
ఈ నెల 10న భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి హైద్రాబాద్ పర్యటన సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరంలో ఇంఛార్జి కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయితో కలిసి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రధాని పర్యటనలో ఎక్కడా చిన్న తప్పిదం జరగకుండా అధికారులు తమకు కేటాయించిన విధులను పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలి" అని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, పోలీస్, విద్యుత్, ట్రాన్స్‌పోర్ట్, ఫుడ్ సేఫ్టీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు సేవ చేసే భాగ్యం లభించింది



**ఎలిగేడు, మే 05(' మహా ప్రభ)**
ఎలిగేడు పిఎసిఎస్ ఇన్‌చార్జి ఛైర్పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, "రైతులకు సేవ చేసే భాగ్యం లభించింది" అని అన్నారు.తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సహకారంతో ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుల్తానాపూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, డైరెక్టర్ తాటిపల్లి రమేష్ బాబు, సీఈఓ కేశెట్టి విక్రమ్ పాల్గొన్నారు.

## ఎసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి




**తలకొండపల్లి, మే 05(' మహా ప్రభ)**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. శరత్ లంచం తీసుకుంటూ ఎసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.ఓ నిర్మాణానికి అనుమతుల కోసం రూ.20 వేల లంచం స్వీకరిస్తుండగా ఎసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి



**తిప్పర్తి, మే 05(' మహా ప్రభ)**
అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని మ్యాచర్‌తో సంబంధం లేకుండా వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నన్నూరి వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం తిప్పర్తి సబ్ మార్కెట్ యార్డులో రైతు సంఘం ఆధ్వర్యంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, "తాలు పేరుతో రైతులను మోసం చేయకుండా, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి. లారీలను సకాలంలో ఏర్పాటు చేసి కొనుగోలు వేగవంతం చేయాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మన్యం బిక్షం, సిఐటియు మండల కన్వీనర్ భీమా దానికి గణేష్, డివైఎఫ్ఐ కార్యదర్శి పోకల శశిధర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు దొంగరి వెంకన్న, నాయకులు మైల సైదులు, సాహిద్, రఫీ, తేజావత్ నర్సింహా, కన్నెబోయిన సైదులు, శరత్ బాబు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ అధికారులకు జువెలరీ యజమానులకు అవగాహన కల్పించిన అడిషనల్ ఎస్పీ. విక్రాంత్ కుమార్ సింగ్



**తూప్రాన్ మే 5.(మహాప్రభ)**
తూప్రాన్ పట్టణంలోని మమతా మినీ ఫంక్షన్ హాల్లో జ్యువెలరీ షాపుల యజమానులు, పాన్ బ్రోకర్లు, గోల్డ్ వ్యాపారులు బ్యాంకు అధికారుల కోసం భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విక్రాంత్ కుమార్ సింగ్ అడిషనల్ ఎస్పీ మేదక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ఇటీవల చోటు చేసుకుంటున్న దొంగతనాలు, దోపిడీలు మరియు మోసాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి జ్యువెలరీ షాప్, గోల్డ్ వ్యాపారి మరియు పాన్ బ్రోకర్ తప్పనిసరిగా ఆధునిక భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాలు హై క్వాలిటీతో ఏర్పాటు చేసి, నిరంతర రికార్డింగ్ మరియు బ్యాకప్ ఉండేలా చూడాలని, అలారం సిస్టమ్స్, సేఫ్టీ లాకర్స్ వినియోగం పెంచాలని తెలిపారు. దుకాణాల్లోకి వచ్చే కస్టమర్ల వివరాలను సరిగా నమోదు చేయడం, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచడం, విలువైన బంగారం మరియు నగలను సురక్షితంగా నిల్వ చేయడం, బ్యాంకు లావాదేవీలలో జాగ్రత్తలు పాటించడం, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎటువంటి అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పోలీస్ శాఖతో సమన్వయం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేంద్ర గౌడ్ , సీఐ రంగా కృష్ణ, ఎస్సై గంగరాజు, ఎస్సై సుభాష్ గౌడ్, సీఐనర్సాపూర్, సీఐ,రామాయంపేట, తూప్రాన్ సబ్‌డివిజన్‌కు చెందిన ఎస్ఐలు పాల్గొన్నారు. జ్యువెలరీ షాపుల యజమానులు, పాన్ బ్రోకర్లు, గోల్డ్ వ్యాపారులు మరియు బ్యాంకు అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై భద్రతా అంశాలపై అవగాహన పొందారు. కార్యక్రమం చివర్లో పాల్గొన్నవారి సందేహాలను నివృత్తి చేసి, భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులచే సూచనలు ఇవ్వడం జరిగింది.

# దేవరకొండ లోన్నృత్య శిక్షణ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

**-అధ్యక్షుడు ఎన్ వి టి**



**దేవరకొండ మే 5 (మహాప్రభ )**
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు మంగళవారం సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాలకు అధ్యక్షుడు ఎన్ వి టి నృత్య శిక్షణ సమ్మర్ క్యాంపు ని సభ్యులతో కలిసి ప్రారంభించినారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నృత్య శిక్షణ సమ్మర్ క్యాంపు ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ కి ఎన్నో సంవత్సరాల నుండి నృత్య శిక్షణ ఇస్తున్న మాస్టర్స్ క్రాంతి మాస్టర్, రాక్ స్టార్ రమేష్ మాస్టర్, ఏడుకొండలు మాస్టర్, లావణ్య మాస్టర్, త్రివేణి మాస్టర్, జగన్ మాస్టర్, వీరితోపాటు ఎంతోమంది దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనమునందు నృత్య శిక్షణ ఇస్తూ ఎంతోమందిని జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి వరకు పోటీలలో పాల్గొనేటట్టు తయారు చేసినారు. అలాగే డి షోలో కూడా మన దేవరకొండ విద్యార్థులు పాల్గొనడం చాలా గర్వించదగ్గ విషయం అని, వారందరికీ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. క్రీడాకారులకు కళాకారులకు కొదవలేని దేవరకొండలో ఇప్పటికీ ఇండోర్ అవుట్ డోర్ స్టేడియాలు లేకపోవడం ఉన్నవి అభివృద్ధిలోకి రాకపోవడం ఎంతో దురదృష్టకరమని అన్నారు. ఈ యొక్క సమ్మర్ కంపెనీ విద్యార్థులు చక్కగా ఉపయోగించుకుంటారని వారందరికీ శు భాకాంక్షలు తెలియజేశారు రు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, భాస్కర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, డాన్స్ మాస్టర్ ఏడుకొండలు, జమీర్, దాసరి రమేష్, వినయ్, శివ, రవి, చింటూ, రాము, అంజయ్య, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు మరింత మెరుగు పడే దిశగా చర్యలు.




**మెదక్ జిల్లా -05మే (మహాప్రభ )**
నర్సాపూర్ బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడే దిశగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు.
మంగళవారం నరసాపూర్ పట్టణంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు కంచర్ల వందన గౌడ్, మర్రిపల్లి చందన, అపర్ణ, బి. వచన్ కుమార్ కమిషన్ సభ్యులు విస్తృతంగా పర్యటించారు. నర్సాపూర్ పర్యటనకు విచ్చేసిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ సీతారెడ్డికి మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ స్వాగతం పలికారు. ముందుగా నరసాపూర్ పట్టణంలో వికాసం వికలాంగుల పునరావాస కేంద్రం సందర్శించి బాల బాలికల సంరక్షణ కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. శారీరక వైకల్యం కలిగిన వికలాంగ చిన్నారిని చూసి చే లించిన హృదయంతో ఆ చిన్నారికి ఆపరేషన్ ద్వారా వైకల్యాన్ని సరిచేసి పౌష్టికాహారం అందించి విద్యాబుద్ధుల నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు.
భవిత కేంద్రాలు ఆదర్శవంతంగా పనిచేస్తున్నాయని చిన్నారులకు ఆటపాటలతో కూడిన నైపుణ్యాలు నేర్పుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. శివం పేట బేతని సంరక్షణ ఆశ్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి సారిస్తుందని కమిషన్ సభ్యులు జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ బాలల హక్కుల ఉల్లంఘనలు, పౌష్టికాహార లోపం, మరియు రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, మెరుగైన విద్య, ఆరోగ్యం, మరియు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం పిల్లలపై దాడులను అరికట్టడానికి కమిషన్ కట్టుబడి ఉందని, ప్రతి 6 నెలలకు లేదా ఏడాదికి ఒకసారి సంరక్షణ కేంద్రాల పనితీరును సమీక్షిస్తామని కమిషన్ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో మహిళా శ్రీ శిశు సంక్షేమ అధికారి హేమ భార్గవి, రామాయంపేట సిడిపిఓ స్వరూప, డిసిపిఓ నాగరాజు,జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ పరిశీలన



**హుస్నాబాద్, మే 05(' మహా ప్రభ)**
: రైతులు వరి ధాన్యాన్ని తేమ శాతం వచ్చేవరకు వ్యవసాయ క్షేత్రాల వద్దనే ఆరబెట్టుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం ఆరబెట్టడం వలన అకాల వర్షాలు వస్తే పెద్ద ఎత్తున నష్టాలు వాటిల్లే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మక్కలు, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు తమకు దగ్గరలోని గ్రామాల వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. మక్కలను మాత్రం వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు చేస్తామని తెలిపారు.ఏఎంసి పరిధిలో పల్లపు ప్రాంతాల్లో ధాన్యం ఆరబెట్టకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, అధికారులు రైతులు ఆ నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తేమ శాతం వచ్చి లిఫ్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం కోసం వెంటనే సరిపడినన్ని లారీలను పంపాలని సివిల్ సప్లై అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు.ఈ పరిశీలనలో ఆర్డీవో రామ్మూర్తి, ఏఎంసి చైర్మన్ తిరుపతి రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## మిషన్ భగీరథ నీరు - అందక ప్రజలకు ఇబ్బందులు

**బి ఆర్ ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రామవతు రవీంద్ర కుమార్**



**దేవరకొండ మే 5 ( మహాప్రభ )**
కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారుల నిరీక్షణతో సరిగా అందని మిషన్ భగీరథ తాగు నీరు అని బి ఆర్ ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు
మిషన్ భగీరథ నీరు రాక గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు
-నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులు
-తక్షణమే సంపులు మర్మతులు చేయాలి అని ఆయన అన్నారు.
-కోదండపురం మిషన్ భగీరథ నీటి సరఫరా సంపులను పరిశీలించిన అనంతరం ఆయన సరైన విధానంలో నీటి సరఫరా చేయాలని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని హెచ్చరిక చేశారు. ఆరు సంపులకు గాను కేవలం రెండు సంపుల ద్వారా మాత్రమే నీరు అందించడం సరైన విధానం కాదని ఆయన తెలిపారు మిషన్ భగీరథ నీరు రాక గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు.నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వ అధికారులు అని ఆయన తెలిపారు.తక్షణమే సంపులు మర్మతులు చేయాలి ఆయన డిమాండ్ చేశారు.

# బిజినెస్

# గంటల్లోనే కుప్పకూలిన బంగారం ధరలు..

**-ఒక్కసారిగా భారీగా పతనం.. లేటెస్ట్ రేట్లు ఇవే..**



బంగారం ధరలు పడిపోతున్నాయి. ఉదయం ఒకరేటు ఉండగా.. మారట?క్టు ప్రారంభం కాగానే ధరలు మారిపోతున్నాయి. ఇటీవల గత కొద్దిరోజులుగా బంగారం ధరలు కుప్పకూలుతూ వస్తోన్నాయి. ఈ వారం కూడా అదే బాటలో నడుస్తున్నాయి. సోమవారం బంగారం ధరలు పతనమవ్వగా.. మంగళవారం మరింత తగ్గుముఖం పట్టాయి. చాలా రోజుల తర్వాత రూ.1.50 లక్షల మార్క్ దిగువకు గోల్డ్ రేట్లు చేరుకున్నాయి.తగ్గిన తర్వాత ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాములు 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,180 వద్ద కొనసాగుతోండగా.. నిన్న రూ.1,49,620 వద్ద స్థిరపడ్డాయి. ఈ రోజు రూ.440 తగ్గిందని చెప్పవచ్చు. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,36,750గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,37,150గా ఉండగా.. నిన్నటితో చూస్తే రూ.400 తగ్గింది.విజయవాడ, విశాఖపట్నంలో కూడా పై ధరలే కొనసాగుతున్నాయి. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,50,770గా ఉండగా.. నిన్న రూ.1,52,730గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.1960 తగ్గింది. 22 క్యారెట్ల రేటు రూ.1,38,200 వద్ద కొనసాగుతోంది. నిన్న ఇది రూ.1.40 లక్షల వద్ద ఉండగా.. ఇవాళ రూ.1800 తగ్గిందని చెప్పవచ్చు.బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,49,180 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,36,750గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,230గా ఉంది. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1,36,900 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీలో కేజీ సిల్వర్ రూ.2.55 లక్షలుగా ఉంది. నిన్న రూ.2.65 లక్షలుగా ఉండగా.. ఇవాళ ఏకంగా రూ.10 వేలు తగ్గింది. ఇక హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉండగా.. నిన్న రూ.2.70 లక్షలుగా ఉంది. ఇక చెన్నైలో రూ.2.65 లక్షల వద్ద కొనసాగుతోంది.

# పెరిగిన యూపీఐ లావాదేవీలు




**న్యూఢిల్లీ,**
యూపీఐ లావాదేవీలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే 2200 కోట్ల లావాదేవీలు జరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో జరిగిన 1,789 కోట్ల లావాదేవీలతో పోలిస్తే 25 శాతం పెరిగాయని పేర్కొంది. కానీ, మార్చి నెలలో రికార్డు స్థాయి 2,264 కోట్ల లావాదేవీలతో పోలిస్తే తగ్గాయి. ఇప్పటి వరకు ఇదే చారిత్రక గరిష్ఠ స్థాయని తన ఎక్స్‌లో వెల్లడించింది.యూపీఐ లావాదేవీలపై రిజర్వుబ్యాంక్ పలు భద్రత ఫీచర్లను పాటిస్తుంది. మొదటిది యూజర్లకు సంబంధించిన అన్ని బ్యాంక్ ఖాతాలను మొబైల్ నంబర్‌తో లింక్డ్ చేయడం, యూపీఐ పిన్, లావాదేవీలను వెనువెంటనే పూర్తయ్యే విధంగా టెక్నాలజీని ఆధునీకరించడం కూడా లావాదేవీలు పెరుగడానికి కారణమని పేర్కొంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో 85 శాతం యూపీఐ ద్వారా జరుగుతున్నాయి.

# రుణాలు మాఫీ చేయిస్తామంటే నమ్మొద్దు..

**-ప్రజల్ని అప్రమత్తం చేసిన ఆర్‌బీఐ**




**ముంబై, మే 4**
రుణాలను మాఫీ చేయిస్తామంటూ జరిగే తప్పుడు ప్రచారాలతో జాగ్రత్తని, ఇలాంటి మోసపూరిత హామీలను ఇచ్చే వ్యక్తులు, సంస్థలకు దూరంగా ఉండాలని ప్రజలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అప్రమత్తం చేసింది. నేరుగా లేదా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అమాయకులను అక్రమార్కులు మోసం చేస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సెంట్రల్ బ్యాంక్ ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది.2023 డిసెంబర్‌లోనూ ఇదే తరహా సూచనను చేశామని గుర్తుచేసిన ఆర్బీఐ.. ఈ మోసాల వల్ల సాధారణ ప్రజానీకమేగాక, సక్రమంగా నడుస్తున్న దేశీయ రుణ వ్యవస్థ సైతం గాడితప్పే ప్రమాదం ఉందన్నది. ఆర్థిక సంస్థల్ని అస్థిరపర్చడమేగాక, డిపాజిటర్ల ప్రయోజనాలూ దెబ్బతింటాయన్నది. కాబట్టి బ్యాంకులు/బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లోని బకాయిలను రద్దు చేయిస్తామన్న మాటల్ని నమ్మి, ఎవరికి ఏవిధంగానూ సొమ్మును చెల్లించరాదని ప్రజలను కోరింది. అలాగే మాయమాటలతో ఇలాంటి మోసాలకు తెగబడితే చట్టప్రకారం కఠిన శిక్షలకు అర్హులవుతారని కేటుగాళ్లను రిజర్వ్ బ్యాంక్ ఈ సందర్భంగా హెచ్చరించింది.

# చెన్నై పాంచ్ పటాకా..

# స్పోర్ట్స్

**-ఢిల్లీపై అలవోక విజయం**
**-శాంసన్ సూపర్ ఇన్నింగ్స్**




ఢిల్లీ
ఐపీఎల్-19లో పడుతూ లేస్తూ సాగుతున్న చెన్నై సూపర్ కింగ్స్.. వరుసగా రెండో విజయం సాధించి ప్లేఆఫ్స్ రేసును రసవత్తరంగా మార్చేసింది. మంగళవారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే.. ఢిల్లీ క్యాపిటల్స్‌ను వారి సొంతగడ్డపై 8 వికెట్ల తేడాతో చిత్తుచేసి సీజన్‌లో ఐదో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ఢిల్లీ నిర్దేశించిన 156 పరుగుల ఛేదనను 17.3 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి పూర్తిచేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ఓపెనర్ సంజూ శాంసన్ (52 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 87 నాటౌట్) మరో కీలక ఇన్నింగ్స్ ఆడగా కార్తీక్ శర్మ (31 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 41 నాటౌట్) అతడికి అండగా నిలిచాడు.
తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ.. మరోసారి పేలవ బ్యాటింగ్‌తో నిర్ణీత ఓవర్లలో 155/7కే పరిమితమైంది. సమీర్ రిజ్వి (24 బంతుల్లో 4 సిక్సర్లతో 40 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (31 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 38) ఆదుకోకుంటే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ (2/22) రెండు వికెట్లు తీయగా అకీల్ (1/19), ముకేశ్ (1/31) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఈ గెలుపుతో ప్లేఆఫ్స్ రేసులో సీఎస్‌కే ముందంజ వేయగా మరోవైపు ఆరో ఓటమితో క్యాపిటల్స్ తమ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది.

**నిలిచి గెలిపించిన శాంసన్**
బంతి ఆధిపత్యం చెలాయించిన పిచ్‌పై ఛేదన అంత తేలికేమీ కాదని తెలియడానికి చెన్నైకి పెద్దగా టైమ్ పట్టలేదు. పవర్ ప్లేలో ఆ జట్టు రుతురాజ్ (6) వికెట్‌ను కోల్పోవడమే గాక చేసింది 44 పరుగులే. స్టార్క్, ఎంగిడి పొదుపుగా బౌలింగ్ చేయడంతో పర్యాటక జట్టు పవర్ ప్లేలో సైతం సింగిల్స్ మీదే దృష్టిపెట్టింది. ఎంగిడి బౌలింగ్‌లో స్కేర్ లెగ్, లాంగాన్ మీదుగా భారీ సిక్సులు కొట్టిన ఉర్విల్ (17).. అక్షర్ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. 50 రన్స్ చేరడానికి ఆ జట్టు 7.2 ఓవర్లు ఆడాల్సి వచ్చింది. కానీ క్రీజులో కుదురుకునేదాకా నెమ్మదిగా ఆడిన సంజూ.. మరో కీలక ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. నటరాజన్ వేసిన 9వ ఓవర్లో రెండు ఫోర్లతో గేర్ మార్చిన అతడు, ఆ తర్వాత ఎక్కడా తగ్గలేదు. కుల్‌దీప్ 12వ ఓవర్లో అయితే 6, 6, 4తో విరుచుకుపడ్డాడు. 32 బంతుల్లో అర్ధ శతకం సాధించిన సంజూ.. స్టార్క్ మరుసటి ఓవర్లోనూ రెండు బౌండరీలు బాది స్కోరుబోర్డును వంద దాటించాడు. నట్టూ వేసిన 15వ ఓవర్లోనూ రెండు సిక్సులు, ఫోర్‌తో 20 రన్స్‌ను రాబట్టి తన జట్టును గెలుపు దిశగా నడిపించాడు. నట్టూ బౌలింగ్‌లోనే సిక్స్, ఫోర్‌తో కార్తీక్ లాంఛనం పూర్తిచేశాడు.

**మళ్లీ తడపడి..**
ఒక మ్యాచ్‌లో ధాటిగా ఆడితే మరోదాంట్లో తేలిపోతున్న ఢిల్లీ.. ఈ పోరులో అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. బ్యాటర్లకు కఠిన సవాల్ విసిరిన పిచ్‌పై చెన్నై స్పిన్నర్లు చెలరేగడంతో క్యాపిటల్స్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఆ జట్టులో రిజ్వి, స్టబ్స్ మినహా మిగిలినవారెవరూ 20 పరుగుల మార్కునూ దాటలేక చతికిలపడ్డారు. అకీల్‌కు తొలి ఓవర్లోనే రెండు బౌండరీలతో స్వాగతం పలికిన నిశాంక (19).. ముకేశ్ ఓవర్లో మిడాన్‌లో బ్రెవిస్ చేతికి చిక్కడంతో ఆ జట్టు వికెట్ల పతనం మొదలైంది. కేఎల్ రాహుల్ (12)ను అకీల్ బోల్తా కొట్టించాడు. ఇదే జోష్‌లో నూర్ తన వరుస ఓవర్లలో కరుణ్ నాయర్ (13), నితీశ్ రాణా (15)ను పెవిలియన్‌కు పంపడంతో మ్యాచ్‌పై సీఎస్‌కే మరింత పట్టుబిగించినట్లైంది.
గుర్జప్‌నీత్ విసిరిన 11వ ఓవర్ ఆఖరి బంతిని ఆడబోయిన ఢిల్లీ సారథి అక్షర్ (2).. కవర్స్‌లో అకీల్ చేతికి చిక్కడంతో ఢిల్లీ 69/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రిజ్వి, స్టబ్స్ వికెట్ కాపాడుకునేందుకే ఆడటంతో ఢిల్లీ స్కోరుబోర్డు ముందుకు కదల్లేదు. 15.2 ఓవర్లకు ఆ జట్టు స్కోరు వంద పరుగుల మార్కును అందుకోగా చెన్నై బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసి క్యాపిటల్స్‌ను భారీ స్కోరు చేయకుండా అడ్డుపడ్డారు. ఈ జోడీ 8 ఓవర్లపాటు క్రీజులో నిలిచినా చేసింది 65 పరుగులే. స్టబ్స్ భారీ స్కోరు చేయలేక విఫలమైనా అన్షుల్ 18వ ఓవర్లో రెండు సిక్సులు కొట్టిన రిజ్వి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చే యత్నం చేశాడు. ఆఖర్లో అశుతోష్ శర్మ (14) రెండు సిక్సర్లతో క్యాపిటల్స్ స్కోరును 150 పరుగుల మార్కును దాటించాడు.

**సంక్షిప్త స్కోర్లు**
**ఢిల్లీ:** 20 ఓవర్లకు 155/7 (రిజ్వి 40ని, స్టబ్స్ 38, నూర్ 2/22, ఒవర్టన్ 1/5);
**చెన్నై:** 17.3 ఓవర్లకు 159/2 (సంజూ 87ని, కార్తీక్ 41ని, అక్షర్ 1/25, ఎంగిడి 1/30)

**ఐపీఎల్ పాయింట్ల పట్టిక**

| జట్లు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| పంజాబ్ | 9 | 6 | 2 | 1 | 13 | 0.85 |
| బెంగళూరు | 9 | 6 | 3 | 0 | 12 | 1.42 |
| హైదరాబాద్ | 10 | 6 | 4 | 0 | 12 | 0.64 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 0 | 12 | 0.51 |
| గుజరాత్ | 10 | 6 | 4 | 0 | 12 | -0.14 |
| చెన్నై | 10 | 5 | 5 | 0 | 10 | 0.15 |
| ఢిల్లీ | 10 | 4 | 6 | 0 | 8 | -0.94 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 1 | 7 | -0.53 |
| ముంబై | 10 | 3 | 7 | 0 | 6 | -0.64 |
| లక్నో | 9 | 2 | 7 | 0 | 4 | -1.07 |

నోట్: ఆ:ఆడినవి, గె:గెలిచినవి, ఓ:ఓడినవి, పా:పాయింట్లు, ర.రే:రన్‌రేట్, ఫ.తే:ఫలితం తేలనివి

# అగ్రస్థానంలోనే భారత్







**దుబాయ్:**
టీ20క్రికెట్‌లో తమకు తిరుగులేదని భారత్ మరోసారి నిరూపించింది. వరుసగా రెండోసారి పొట్టి ప్రపంచకప్ (మొత్తంగా మూడోసారి) గెలిచి చరిత్ర సృష్టించిన టీమ్ఇండియా.. ఐసీసీ వార్షిక టీ20 ర్యాంకింగ్స్‌లో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 2025 మే నుంచి జరిగిన మ్యాచ్‌ల వెయిటేజీని పరిగణనలోకి తీసుకున్న ఐసీసీ ఈ ర్యాంకులను విడుదల చేసింది.275 రేటింగ్ పాయింట్లతో మెన్ ఇన్ బ్లూ తొలి స్థానంలో ఉండగా ఇంగ్లండ్ (262), ఆస్ట్రేలియా (258), న్యూజిలాండ్ (247), సౌతాఫ్రికా (244) టాప్-5లో నిలిచాయి.

# హాలీవుడ్ సెన్సేషన్..

## క్రిస్టోఫర్ నోలన్ 'ది ఒడిస్సీ' ట్రైలర్ విడుదల!




హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ది ఒడిస్సీ'కి సంబంధించిన కొత్త ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. యూనివర్సల్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 17న థియేటర్లలోకి రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేయగా.. ట్రైలర్‌లో గ్రీకు వీరుడు ఒడిస్సియస్, ట్రోజన్ యుద్ధం ముగిసిన తర్వాత తన భార్య మరియు కొడుకును రక్షించుకోవడానికి రాజ్యమైన ఇథాకాకు తిరిగి వచ్చే క్రమంలో ఎదుర్కొనే సుదీర్ఘమైన, ప్రమాదకరమైన ప్రయాణామే ఈ సినిమా కథ. ఇందులో ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటిస్తుండగా, అతని కుమారుడు టెలిమాకస్‌గా టామ్ హాలండ్, భార్య పెనెలోప్ పాత్రలో అన్నే హాత్వే కనిపించనున్నారు. అలాగే నింఫ్ కాలిప్సోగా చార్లీజ్ థెరాన్, పెనెలోప్‌ను వివాహం చేసుకుని రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని చూసే విలన్ ఆంటినస్ పాత్రలో రాబర్ట్ ప్యాటిన్సన్ నటిస్తున్నారు. హోమర్ రాసిన పురాణ గాథ 'ది ఒడిస్సీ' ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో సైక్లోప్స్ వంటి పూరణ జీవులను నోలన్ తనదైన శైలిలో అద్భుతంగా చూపించబోతున్నట్లు తెలుస్తుంది. పూర్తిస్థాయి ఐమాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన ఈ సినిమాలోని యుద్ధ సన్నివేశాలు వెండితెరపై ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సుమారు 250 మిలియన్ డాలర్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం నోలన్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన సినిమాగా నిలవనుంది.

## ఫౌజీ షూటింగ్ యూనిట్

# కారుకు ప్రమాదం

### ప్రమాదంలో ఒకరు మృతి...పలువురికి గాయాలు




ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఫౌజీ' మూవీ షూటింగ్ కి వెళుతున్న వాహనానికి ప్రమాదం జరగడంతో విషాదం చోటు చేసుకుంది. సినిమా షూటింగ్‌లో భాగంగా ప్రొడక్షన్ యూనిట్ సభ్యులు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురవడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో జరిగినట్లు సమాచారం. యూనిట్ సభ్యులు షూటింగ్ కోసం బయలుదేరగా, ఆ కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంతో 'ఫౌజీ' చిత్ర యూనిట్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది. చిత్రబృందం సభ్యులు గాయపడిన వారి ఆరోగ్యంపై ఆరా తీస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు ముందుకొస్తున్నారు. ప్రమాదంలో ఒకరి మృతి చెందడం సినిమా యూనిట్‌ను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇక ఈ చిత్రాన్ని 'సీతారామం'తో గుర్తింపు పొందిన దర్శకుడు హను రాఘవపూడి రూపొందిస్తున్నారు. ప్రేమ, దేశభక్తి, యాక్షన్ మేళవింపుతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది.

# వైరల్ అవుతున్న సారా అర్జున్ లేటెస్ట్ ఫోటో షూట్




ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రేక్షకులను ఆకట్టుకున్న సారా అర్జున్, ఇప్పుడు తన తాజా గ్లామరస్ ఫోటోషూట్‌తో ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. దురంధర్ సిరీస్ విజయం ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెట్టింది. ఈ సిరీస్ సక్సెస్ తర్వాత సారా కెరీర్ గ్రాఫ్ ఒక్కసారిగా మారిపోయింది, ఆమె మోస్ట్ వాంటెడ్ హీరోయిన్స్‌లో ఒకరిగా నిలిచింది. తాజాగా ఒక పాపులర్ మ్యాగజైన్ కవర్ పేజీపై సారా అర్జున్ ఇచ్చిన పోజులు నెటిజన్‌లను ఆశ్చర్యపరుస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్లామర్ డోస్ పెంచి, కమర్షియల్ సినిమాలకు తను సరైన ఛాయిస్ అని సంకేతాలు ఇచ్చింది. ఆమె స్టైలిష్ లుక్స్, కాన్ఫిడెంట్ పోజులు, సొగసైన రూపం సోషల్ మీడియాలో విశేష దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దీంతో సారా అర్జున్ లేటెస్ట్ లుక్స్ జాతీయ స్థాయిలో వైరల్ అవుతున్నాయి. అభిమానులు ఆమె తదుపరి ప్రాజెక్టు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

వైరల్ అవుతున్నసారా అర్జున్ లేటెస్ట్ ఫోటో షూట్

ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రేక్షకులను ఆకట్టుకున్న సారా అర్జున్, ఇప్పుడు తన తాజా గ్లామరస్ ఫోటోషూట్‌తో ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. దురంధర్ సిరీస్ విజయం ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెట్టింది. ఈ సిరీస్ సక్సెస్ తర్వాత సారా కెరీర్ గ్రాఫ్ ఒక్కసారిగా మారిపోయింది, ఆమె మోస్ట్ వాంటెడ్ హీరోయిన్స్‌లో ఒకరిగా నిలిచింది. తాజాగా ఒక పాపులర్ మ్యాగజైన్ కవర్ పేజీపై సారా అర్జున్ ఇచ్చిన పోజులు నెటిజన్‌లను ఆశ్చర్యపరుస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్లామర్ డోస్ పెంచి, కమర్షియల్ సినిమాలకు తను సరైన ఛాయిస్ అని సంకేతాలు ఇచ్చింది. ఆమె స్టైలిష్ లుక్స్, కాన్ఫిడెంట్ పోజులు, సొగసైన రూపం సోషల్ మీడియాలో విశేష దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దీంతో సారా అర్జున్ లేటెస్ట్ లుక్స్ జాతీయ స్థాయిలో వైరల్ అవుతున్నాయి. అభిమానులు ఆమె తదుపరి ప్రాజెక్టు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# టాక్సిక్'లో బోల్డ్ సీన్స్ వివాదం ...

## -కియారా అద్వానీ క్లారిటీతో పుకార్లకు చెక్



కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'టాక్సిక్' చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. సినిమాలో తనపై చిత్రీకరించిన కొన్ని హాట్ సీన్స్‌ను తొలగించమని లేదా మార్చాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. టీజర్‌లో కనిపించిన గ్లామరస్ విజువల్స్ కారణంగా ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. దీంతో సినిమాలో ఘాటైన సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాలు ప్రేక్షకుల్లో పెరిగాయి.కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'టాక్సిక్' చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. సినిమాలో తనపై చిత్రీకరించిన కొన్ని హాట్ సీన్స్‌ను తొలగించమని లేదా మార్చాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. టీజర్‌లో కనిపించిన గ్లామరస్ విజువల్స్ కారణంగా ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. దీంతో సినిమాలో ఘాటైన సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాలు ప్రేక్షకుల్లో పెరిగాయి.ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. యష్ -- కియారా కాంబినేషన్ కూడా సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ప్రస్తుతం కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో ధృవీకరించని వార్తలు ఎంత వేగంగా వ్యాప్తి చెందుతాయో 'టాక్సిక్' వివాదం మరోసారి నిరూపించింది. అధికారిక ప్రకటనలు లేకుండా వచ్చే వార్తలను నమ్మడంలో జాగ్రత్త అవసరమని ఈ సంఘటన సూచిస్తోంది .

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com